సాక్షి
తిరుపతి
ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



ఇసుక రీచ్ కోసం విధ్వంసం

ఇసుక రీచ్ కోసం అధికారులు వచ్చని పైరుని ధ్వంసం చేసిన ఘటన పెళ్లకూరు మండలంలో చర్చనీయాంశమైంది. - IIలో



ఏనుగుల గుంపు స్వైర విహారం

ఏనుగుల గుంపు స్వైరవిహారం చేస్తోంది. అటవీ సరిహద్దులోని పంట పొలాలను ధ్వంసం చేస్తూ రైతుకు కన్నీళ్లు మిగుల్చుతోంది. - IIలో



పింఛన్ల పంపిణీకి సర్వర్ కష్టాలు

పింఛన్ల పంపిణీకి సర్వర్ కష్టాలు వెంటాడాయి. శనివారం ఉదయం సుమారు రెండు గంటల పాటు పనిచేయలేదు. - IIలో

కూటమి ప్రభుత్వం బరితెగించింది. నిబంధనలను తుంగలో తొక్కింది. తిరుపతి కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ పదవి కోసం విధ్వంసానికి పాల్పడింది. బలం లేకపోయినా బరిలో నిలిచేందుకు కుయుక్తులు పన్నింది. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను భయభ్రాంతులకు గురిచేసింది. ఆస్తులను ధ్వంసం చేస్తూ తమవైపు తిప్పుకునేందుకు పన్నాగం పన్నింది. నగర ప్రథమ పౌరురాలిపై అమానవీయంగా ప్రవర్తించి అగౌరపరిచింది. ఇంత జరుగుతున్నా అధికారయంత్రాంగం చూస్తూ ఉండిపోవడం.. కూటమి నేతలకే వత్తాసు పలకడం విస్మయానికి గురిచేసింది.

బలం లేక బరితెగింపు!


నిరసన వ్యక్తం చేస్తున్న భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ శిరీష, కార్యకర్తలు


బైఠాయించిన మేయర్ శిరీష

వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల ఆస్తుల విధ్వంసం

- నోటీసులు ఇవ్వకుండా అక్రమం అంటూ కూల్చివేతలు
- సాక్షాత్తు నగర ప్రథమ పౌరురాలు చెబుతున్నా వినకుండా దౌర్జన్యం
- కూల్చివేతలను అడ్డుకునేందుకు యత్నించిన వారి గొంతు నొక్కిన అధికారులు
- మహిళలను అడ్డుకునేందుకు మహిళా పోలీసులు లేరా?
- ఆధ్యాత్మిక నగరంలో డెప్యూటీ మేయర్ కోసం అధికార అరాచకం

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుపతి కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ అరాచకానికి అడ్డేలేకుండా పోతోంది. బలం లేకపోయినా బరితెగింపునకు దిగింది. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను భయపెట్టి డెప్యూటీ మేయర్ పీఠాన్ని కైవశం చేసుకునేందుకు ఆస్తుల విధ్వంసానికి తెరదీసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ.. అధికారులు అధికార పార్టీ నేతల అండతో రెచ్చిపోవడం.. మేయర్ డాక్టర్ శిరీష చెబుతున్నా వినకుండా ఆమె పట్ల అమానవీయంగా ప్రవర్తించడం విమర్శలకు తావిస్తోంది.

బలం లేకపోయినా..

తిరుపతి కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ ఉప ఎన్నిక ఈనెల 3న జరగనుంది. ఈ ఎన్నిక కోసం వైఎస్సార్‌సీపీ తరఫున డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా 42వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్‌రెడ్డిని బరిలోకి దింపారు. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 50 డివిజన్లలో 48 వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందినా.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పార్టీ నేతలు కొందరు కార్పొరేటర్లను భయపెట్టి లాక్కున్నారు. అలా 9 మంది కార్పొరేటర్లు వారివైపు ఉన్నా.. మిగిలిన 39 మంది కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీ వారే. ఏ రకంగా చూసినా తిరిగి డెప్యూటీ మేయర్ పదవి వైఎస్సార్‌సీపీకే దక్కాలి.

కుట్రలు..ఒత్తిళ్లు

ఒకే ఒక్క డివిజన్‌ని గెలుసుకున్న టీడీపీ మరికొందరు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో డెప్యూటీ మేయర్ పదవిని లాక్కునేందుకు అరాచకాలకు దిగింది. శేఖర్‌రెడ్డిని పోటీ నుంచి తప్పుకోవాలని, వారి కుటుంబ సభ్యులకు ఫోన్లు చేసి తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు చేశారు. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి కూటమి నేతలు పోలీసులు, కార్పొరేషన్, రెవెన్యూ అధికారులను రంగంలోకి దింపి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల ఆస్తుల విధ్వంసానికి తెరదీశారు. కూటమి నేతలు అధికారాన్నంతా ఉపయోగించి వైఎస్సార్‌సీపీ డెప్యూటీ మేయర్ అభ్యర్థి శేఖర్‌రెడ్డిని శనివారం రాత్రి తమవైపు తిప్పుకున్నారు.

ఈడ్చిపడేశారు

నగర ప్రథమ పౌరురాలు డాక్టర్ శిరీష, వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, మహిళా నాయకురాళ్లని ఈడ్చిపడేశారు. పత్రికలో రాయలేని పదాలతో తిట్ల పురాణం అందుకున్నారు. పోలీసులు చుట్టుముట్టి నెట్టుకుంటూ భూమన అభినయ్‌రెడ్డిని బయటకు లాగి పడేశారు. పోలీసులు విచక్షణ కోల్పోయి వ్యవహరించిన తీరు విస్మయానికి గురిచేసింది. మహిళ పట్ల మగ పోలీసులు వ్యవహరించిన తీరుపై పార్టీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

కూటమి దౌర్జన్య కాండ

అక్రమ కట్టడాలను పడగొట్టేందుకు అనుసరించాల్సిన మార్గదర్శకాలను కార్పొరేషన్ అధికారులు పట్టించుకోలేదు. నగరంలోని శాంతినగర్‌లోని భవనం కూల్చేస్తామని ముందుగా పుకార్లు పుట్టించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అక్కడికి చేరుకోవడంతో శ్రీనివాసం సముదాయం వెనుక డీబీఆర్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న భవనం కూల్చే పనులు చేపట్టారు. విషయం తెలుసుకుని నాయకులు అక్కడికి చేరుకునే లోపు రెండు గదుల గోడలను కూల్చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు టౌన్ ప్లానింగ్ అధికారులను అడ్డుకుని నిరసనకు దిగారు.


నేను చెబుతున్నా వినరా: మేయర్ వాగ్వాదం


నిబంధనలకు విరుద్ధంగా కూల్చివేతలు


అడ్డదిడ్డంగా కూల్చేసిన అధికారులు


కూల్చివేతలు ఇలా..




గొంతు పట్టుకుని ఈడ్చిపడేస్తున్న పోలీసులు


పోలీసుల దౌర్జన్యం


తోస్తూ..నెట్టేస్తూ!

ఇంత దుర్మార్గమా బాబూ!


మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి, పక్కన అభినయ్‌రెడ్డి, మేయర్ శిరీష, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి


తిరుపతి మంగళం: ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో కూటమి ప్రభుత్వంలోని పాలకులు అరాచకం సృష్టించారు. డిప్యూటీ మేయర్ ఎన్నికలో ఎలాగైనా గెలవడానికి అనైతికంగా అధికారులను అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరించారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి మండిపడ్డారు. తిరుపతిలోని తన నివాసంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పాలనలో ఇంత దుర్మార్గమా..? ప్రభుత్వ అధికారులు కూటమి ప్రభుత్వానికి బానిసలుగా పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా ప్రకటించిన శేఖర్‌రెడ్డిని, అతని కుటుంబాన్ని భయపెట్టి లొంగదీసుకోవడం సిగ్గుచేటన్నారు. తమ పార్టీ నాయకులు గఫూర్, లక్ష్మణ్ ఇళ్లను కూడా కూల్చివేశారన్నారు.

సుప్రీంకోర్టుకు వెళ్తాం

నిర్మాణాల కూల్చివేతపై సుప్రీంకోర్టు ఆదేశాలను తిరుపతి మున్సిపల్ అధికారులు బేఖాతర్ చేశారని భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయివేటు స్థలాలను ఆక్రమించి ఉంటే, ఆ కట్టడాలను పడగొట్టేందుకు అనుసరించాల్సిన మార్గదర్శకాలను కార్పొరేషన్ అధికారులు పాటించలేదని, దీనిపై తాము సుప్రీం కోర్టుకు వెళ్తామని ఆయన హెచ్చరించారు.

డెప్యూటీ మేయర్ అభ్యర్థిగా లడ్డూ భాస్కర్‌రెడ్డి

శేఖర్‌రెడ్డి పోటీ నుంచి తప్పుకుంటే తిరుపతి 47వ డివిజన్ కార్పొరేటర్ లడ్డూ భాస్కర్ రెడ్డిని డెప్యూటీ మేయర్ అభ్యర్థిగా తాము నిలబెడుతున్నామని ప్రకటించారు. సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, కార్పొరేటర్లు లడ్డూ భాస్కర్‌రెడ్డి, ఆదం రాధాకృష్ణారెడ్డి, తమ్ముడు గణేష్ పాల్గొన్నారు.


భూమన అభినయ్‌రెడ్డిని తీసుకెళ్తున్న పోలీసులు

ప్రజాస్వామ్యం అపహాస్యం

తిరుపతి తుడా: కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో కనీస బలం లేని చోట గెలవాలని చూడడం అప్రజాస్వామికమన్నారు. డెప్యూటీ మేయర్ పోటీదారుడ్ని భయభ్రాంతులకు గురిచేసి, ఆయన ఆస్తులను ధ్వంసం చేసి లొంగదీసుకునే ప్రయత్నం సిగ్గుచేటన్నారు. అలానే వైఎస్ఆర్‌సీపీ కార్పొరేటర్లపై బెదిరింపులకు దిగడం దుర్మార్గమన్నారు. కనీస నిబంధనలు పాటించకుండా, చట్టాలను అతిక్రమించి భవనాలను కూల్చడం అన్యాయమన్నారు. భవన నిర్మాణానికి అనుమతులు లేకుంటే నోటీసులు ఇచ్చి పనులను ఆపాలే తప్ప కూల్చే అధికారం ఎవరికీ ఉండదన్నారు. తమకు పూర్తి మెజారిటీ ఉన్న స్థానంలో పోటీ చేస్తున్నమే తప్ప పిరాయింపులను ప్రోత్సహించడం లేదని ఆయన చెప్పారు. ఈ క్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో ఆయన వాగ్వాదానికి దిగారు. నోటీసులు ఇవ్వకుండా భవనం పైకి ఏ అధికారంతో వచ్చారని నిలదీశారు.

నిబంధనలకు విరుద్ధం

టౌన్ ప్లానింగ్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని మేయర్ డాక్టర్ ఆర్.శిరీష అన్నారు. అక్రమ కూల్చివేతలను అడ్డుకునేందుకు ఆమె తన అనుచరులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. భూమన అభినయ్‌రెడ్డితో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కూల్చివేతలపై న్యాయపోరాటం చేస్తామని, ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ దోషులుగా కోర్టు ముందు నిలబెడతామని హెచ్చరించారు.

48 మంది అరెస్ట్

అక్రమ కూల్చివేతలను అడ్డుకునేందుకు వెళ్లిన నగర మేయర్ డాక్టర్ ఆర్.శిరీష, వైఎస్ఆర్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డితోపాటు పార్టీ ముఖ్య నేతలు, ఇతర నాయకులు 48 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్వీయూ పోలీస్ స్టేషన్‌లో 25 మంది, వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో 23 మందిని అరెస్టు చేసి ఆపై విడుదల చేశారు.

అరెస్టు చేశాక పోలీసు ప్రొటెక్షన్ కోరిన టౌన్ ప్లానింగ్

టౌన్ ప్లానింగ్ అధికారులు అడుగడుగున తప్పటడుగులు వేశారు. ఉదయం నిరసన కార్యక్రమం అనంతరం వైఎస్ఆర్‌సీపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించాక టౌన్ ప్లానింగ్ అధికారులు అప్పటికప్పుడు పోలీసు ప్రొటెక్షన్ కోరుతూ కాపీలను సిద్ధం చేశారు.

అరెస్టులు అప్రజాస్వామికం



ప్రజాస్వామ్య విధానాలను తుంగలో తొక్కుతూ, అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరదీసింది. కూటమి ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తూ మున్సిపల్ అధికారులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య విలువలకు గొడ్డలిపెట్టు. తిరుపతి నగరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉన్నా కూడా అప్రజాస్వామ్య పద్ధతిలో మా అభ్యర్థి గెలుపును అడ్డుకోవడానికి కుట్రలు చేయడం విడ్డూరంగా ఉంది. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రభుత్వం వ్యవహరిస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. - ఎం.గురుమూర్తి, ఎంపీ, తిరుపతి


వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఈడ్చి పడేస్తున్న పోలీసులు


కార్యకర్తలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

చంద్రగిరిలో యథేచ్ఛగా మట్టి దందా!


అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్

- అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్న వైనం
- ఆర్సీ పురం అడ్డాగా సాగుతున్న మట్టి అక్రమ రవాణా
- రోజుకి 500 ట్రిప్పుల చొప్పున తరలింపు
- మట్టి అక్రమార్కులకు అండగా నియోజకవర్గ ముఖ్యనేత

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలో మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. రామచంద్రాపురాన్ని అడ్డాగా చేసుకుని మట్టి మాఫియా చెలరేగిపోతోంది. నియోజకవర్గ ముఖ్యనేత కనుసన్నల్లో సాగుతున్న ఈ దందాపై ఏ అధికారీ కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రోజూ 50 టిప్పర్లు.. 500 ట్రిప్పులు

కొండలు, గుట్టలు అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల్లో తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంతగా మట్టి వ్యాపారాన్ని సాగిస్తున్నారు. రాత్రి పూట అక్రమంగా మట్టి తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. రామచంద్రాపురం మండలంలోని నెన్నూరు, రామాపురం, రాయలచెరువు, పీవీపురం, నెత్తకుప్పం, అనుపల్లి, బొప్పరాజుపల్లి ప్రాంతాల్లో నిత్యం మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రోజుకు 50 టిప్పర్ల చొప్పున.. అందులో ఒక్కొక్క టిప్పర్ పది ట్రిప్పుల వంతున మట్టి తరలిస్తున్నాయి. ఆ లెక్కన 500 ట్రిప్పుల మట్టి బయటకు తరలుతోంది. ఈ మొత్తం మట్టి మాఫియాకు నియోజకవర్గ ముఖ్యనేత అండ ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో ఆయనకు రోజుకు 50 టిప్పర్ల నుంచి రూ.7.5 లక్షల వరకు అవినీతి ఖాతాలోకి జమచేస్తున్నట్లు సమాచారం. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పచ్చదనాన్ని హరించి వేస్తూ కొండలు, గుట్టలను కొల్లగొడుతున్న వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


మట్టి మాఫియా ఇష్టారాజ్యం

ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు

రామచంద్రాపురం మండలం పరిధిలో ఎక్కడా మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. పక్క మండలాల్లో ఇచ్చిన అనుమతులను చూపించి మట్టి తవ్వుతుండడంతో వారిని అడ్డుకున్నాం. ఎక్కడెక్కడ మట్టి తవ్వకాలు చేస్తున్నారో అక్కడంతా కందకాలు తవ్వించాం. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే వాహనాలు సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.
- వెంకటరమణ, తహసీల్దారు, రామచంద్రాపురం

దరఖాస్తుల ఆహ్వానం

బుచ్చినాయుడుకండ్రిగ: కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య ఎస్టీ గురుకుల పాఠశాలలో 6వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ ధర్మేంద్రసింగ్ తెలిపారు. గురుకులంలో సీబీఎస్‌సీ సిలబస్ చదువు చెబుతున్నామని, 6వ తరగతిలో చేరడానికి ఎస్టీ కులానికి చెందిన 30 మంది బాలికలు, 30 మంది బాలురు అవసరమని పేర్కొన్నారు. గత నెల 22 నుంచి ఈనెల 19వ తేదీ వరకు ఆన్‌లైన్ గురుకుల వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రాత పరీక్ష ఈనెల 25వ తేదీన ఉంటుందని, వివరాలకు గురుకులం వెబ్‌సైట్‌లో పరిశీలించాలని కోరారు.

కుంభమేళాకు ప్రత్యేక బస్సు

తిరుపతి అర్బన్: కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం 11000 సర్వీస్ నంబర్‌తో ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు డీసీటీఎం విశ్వనాథం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ఈ నెల 7వ తేదీ అలాగే 14వ తేదీ రాత్రి 9 గంటలకు తిరుపతి బస్టాండ్ నుంచి బయలుదేరుతుందని వెల్లడించారు. పది రోజులు టూర్ ఉంటుందని పేర్కొన్నారు. ఒక్కో వ్యక్తి రూ.10 వేలు టికెట్ ఉంటుందని చెప్పారు. ప్రయాగ్‌రాజ్ (కుంభమేళా)తోపాటు వారణాసి, గయా, కోణార్క్ ప్రాంతాలను సందర్శించవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్ రిజర్వేషన్ చేసుకోవచ్చని సూచించారు. అలాగే 30 మంది భక్తులు వచ్చి కుంభమేళాకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు కావాలంటే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి


అమ్మవారి ఆలయం వద్ద హైకోర్టు న్యాయమూర్తి

తిరుపతి రూరల్: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద వారికి ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలతో పాటు అమ్మవారి పసుపు, కుంకుమ, తీర్థ ప్రసాదాలను అందించారు.

కూరగాయలు @ రూ.30



వెంకటగిరి పట్టణంలో కొందరు తక్కువ ధరకే తాజా కూరగాయలను విక్రయిస్తున్నారు. మదనపల్లె, పీలేరు, కడప తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు వచ్చి విక్రయాలు సాగిస్తున్నారు. ఏ కూరగాయలైనా కిలో రూ.20 నుంచి రూ.30 లెక్కన విక్రయిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఇందులో క్యారెట్, బీట్రూట్, దొండ, బెండ, చిక్కుడు, ముల్లంగి, ఆలూ రూ.20 చొప్పున.. బీన్స్, వంకాయలు, అల్లం, మామిడి కిలో రూ.30 లెక్కన విక్రయిస్తున్నారు. టమాటాలు రూ.100కి 5 కిలోలు, ఎర్రగడ్డలు రూ.100కి 3 కిలోల చొప్పున విక్రయిస్తున్నారు. దీంతో వెంకటగిరి పరిసర ప్రాంత ప్రజలు కూరగాయాలు కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. - వెకంటగిరి రూరల్

పింఛన్ల పంపిణీకి సర్వర్ కష్టాలు



రేణిగుంట మండలం, గురవరాజుపల్లెలో పింఛన్లు పంపిణీ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ



చిట్టమూరు మండలం, ఆరూరు సచివాలయం వద్ద ఆటోలోనే ఎదురుచూపులు

తిరుపతి అర్బన్: పింఛన్ల పంపిణీకి సర్వర్ కష్టాలు ఎదురయ్యాయి. శనివారం ఉదయం 2 గంటల పాటు తరచూ సర్వర్ కష్టాలు చోటుచేసుకున్నాయి. దీంతో గంటల కొద్దీ వృద్ధులు, వికలాంగులు పింఛన్ల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పింఛన్ల పంపిణీలో జోరు తగ్గింది. మొత్తంగా శనివారం 96.21 శాతం మందికి పింఛన్లు అందించారు. తిరుపతిలో 97.5శాతం అధికంగా ఫించన్ల పంపిణీ చేపట్టారు. పింఛన్లు శనివారం ఇవ్వని వారికి సోమవారం చెల్లిస్తారని డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు తెలిపారు.

ఇసుక రీచ్ కోసం విధ్వంసం

- వరి పైర్లు ధ్వంసం
- అధికారుల తీరుపై మండిపడ్డ రైతులు



స్వర్ణముఖి నదిలో ఇసుక రీచ్ కోసం రోడ్డు వేయడానికి ధ్వంసం చేసిన వరి పైరు

పెళ్లకూరు: ఇసుక రీచ్ కోసం అధికారులే విధ్వంసానికి దిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. వరి పైర్లను సైతం లెక్క చేయక యంత్రాలతో ధ్వంసం చేయడం విమర్శలకు తావిస్తోంది. వివరాలు.. మండలంలోని కలవకూరు గ్రామం వద్ద స్వర్ణముఖినదిలో ఇసుక రీచ్ కోసం నదీ తీరంలో ఉన్న వరి పైర్లను శనివారం అధికారులు యంత్రాలతో ధ్వంసం చేశారు. స్వర్ణముఖి నదిలో ఇసుక రీచ్ కోసం నాలుగు నెలల కిందట డివిజన్ స్థాయి రెవెన్యూ యంత్రాంగం కలవకూరు, పుల్లూరు, తాళ్వాయిపాడు, పాలచ్చూరు తదితర ప్రాంతాల్లో పరిశీలించారు. కానీ ఇసుక రీచ్‌కు స్వర్ణముఖినదిలో ఏ ప్రాంతం వద్ద కేటాయిస్తారు అనే విషయమై స్పష్టత లేదు. అయితే గత ఏడాది నవంబర్ నుంచి కురిసిన భారీ వర్షాలకు వరద ప్రవాహం అధికంగా ఉంది. అందువల్ల రీచ్ ఏర్పాటును అధికారులు పట్టించుకోలేదు. ఇటీవల వరద ఉధృతి తగ్గడం, ఇసుక రీచ్ కోసం అధికార పార్టీకి చెందిన ఓ ప్రముఖ వ్యక్తికి బిడ్ కేటాయించడంతో అధికారులు ఆగమేఘాలపై స్పందించారు. రెండు రోజుల కిందట సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి కలవకూరు వద్ద ఇసుక రీచ్ ఏర్పాటు కోసం మరోమారు పరిశీలించారు. వెనువెంటనే నదీ తీరంలో ఉన్న పచ్చని వరి పైర్లను యంత్రాలతో ధ్వంసం చేయించి రీచ్ కోసం రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. కనీసం నోటీసులు కూడా జారీ చేయకుండా అధికార పార్టీ పెద్దల కోసం పచ్చని వరిపైర్లు యంత్రాలతో ధ్వంసం చేయడంపై పలువురు ఆవేదన చెందుతున్నారు. కలెక్టర్ స్పందించి కలవకూరు వద్ద ఇసుక రీచ్‌ను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ధ్వంసం చేసిన వరిపైర్ల వద్ద రైతుల ఆవేదన



యంత్రాలతో వరిపైర్లు ధ్వంసం

అన్యాయం



రైతులు స్వర్ణముఖి నదీ తీరంలో సుమారు వందేళ్లుగా 150 ఎకరాల అనాధీనం భూములు సాగు చేసుకుంటున్నారు. ఈ ఏడు వరి పైర్లు నాటారు. కలవకూరు, పుల్లూరు గ్రామాల్లో వేల ఎకరాలకు స్వర్ణముఖినది జీవనాధారం. అధికార పార్టీ నేతకు రీచ్ ఏర్పాటు చేయడం కోసం రేపోమాపో చేతికందే వరి పంటను యంత్రాలతో తొక్కించి ధ్వంసం చేయడం అన్యాయం.

– చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు

నేడు సీనియర్ బాలికల హాకీ జిల్లా జట్టు ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్రీడా మైదానంలో ఆదివారం ఉదయం 7.30 గంటలకు సీనియర్ బాలికల హాకీ జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. ఆ మేరకు జిల్లా హాకీ సంఘం కార్యదర్శి బీ.ఆదిత్య, కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్‌కృష్ణ, కోచ్ అశోక్‌రెడ్డి ఓ సంయుక్త ప్రకటనలో విడుదల చేశారు. ఈ పోటీలకు 01-01-1996 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపిక చేసిన జిల్లా జట్టు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరులో నిర్వహించనున్న 14వ రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారిణీలు బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 77028 65721, 70131 77413 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

ఏనుగుల దాడులు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరి పైరు

భాకరాపేట : అటవీ సరిహద్దు పంట పొలాలపై ఏనుగులు గుంపు స్వైర విహారం చేసింది. శనివారం తెల్లవారు జామున ఏనుగులు గుంపు ఎర్రావారిపాళెం మండలం, కొటకాడపల్లె పంచాయతీ, అయ్యగారిపల్లె గ్రామ అటవీ సరిహద్దు పొలాల్లోకి వచ్చి వరి పైరును తొక్కి ధ్వంసం చేసింది. ఏనుగుల ఘీంకారాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. దీంతో రైతులు అటు వైపు వెళ్లడానికి సాహసం చేయలేక పోయారు. వారం క్రితం చంద్రగిరి మండలం సీఎం ఇంటి ముందు ఉన్న పంట పొలాల్లో ఏనుగులు గుంపు తిష్టవేసిన విషయం తెల్సిందే. వాటిని తరమడానికి వెళ్లిన ఉప సర్పంచ్, టీడీపీ నాయకుడు మృతిచెందాడు. అయినా సంబంధిత అధికారులు స్పందించలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 51,818 మంది స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.52 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది.

సీతకన్ను!

- నిర్మలమ్మ పద్దులో జిల్లాకు రిక్తహస్తమే!
- మాటల గారడీ ... ఊహల పల్లకీగా కేంద్ర బడ్జెట్
- ఊసేలేని జాతీయ రహదారుల ప్రస్తావన
- కొత్త రైల్వే లైన్లు, విద్యారంగానికి ఉత్తి చేతులే
- పెదవి విరుస్తున్న మేధావులు



తిరుపతి సిటీ: కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించింది. ఎన్డీయేలో కీలక భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు తేవడంలో విఫలమైంది. విభజన చట్టాల జోలికి వెళ్లకుండా కేంద్రం అంకెల గారడీని చూపించే ప్రతయత్నం చేసింది. వెనుబడిన రాయలసీమకు చెందిన సాగు, తాగునీటి ప్రాజెక్టులకు, కేంద్ర విద్యాసంస్థలకు, వ్యవసాయరంగానికి బడ్జెట్ కేటాయింపులలో నిరాశే మిగిలింది. జిల్లాలోని జాతీయ రహదారులు, రైల్వేలైన్లు, బ్రిడ్జిలు, స్టేషన్ల అభివృద్ధి, విమానాశ్రయాల అభివృద్ధి ప్రస్తావనే బడ్జెట్లో లేక పోవడంపై మేధావులు పెదవి విరుస్తున్నారు.

నిధులు రాబట్టడంలో విఫలం



ప్రస్తుత బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందింది. కూటమి ఎంపీల బలంతో కేంద్ర ప్ర భుత్వం నడుస్తోందని గొప్పలు చెప్పుకోవడంతోనే సరిపోయింది. బీహార్ రాష్ట్రానికి కేటాయించిన మేర కూడా రాష్ట్రానికి నిధులు సాధించ లేక పోయింది. ఏపీకి ఒరిగిందేమీ లేదు. – ఎం.గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

వేతన జీవుల కడుపుకొట్టే బడ్జెట్



బడ్జెట్లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది. నిరాశ జనకంగా నిర్మలమ్మ బడ్జెట్ ఉంది. వేతన జీవులకు అనుకూలంగా లేదు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకే వరాల బడ్జెట్‌గా మారింది. వికసిత్ భారత్ చేయాలన్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలి. విశాఖ ఉక్కు పరిశ్రమకు అవసరమైన గనులను కేటాయించకపోవడం, జిల్లాలో నీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయించకపోవడం చూస్తుంటే ఇది కేవలం పేదల బడ్జెట్ కాదు. –పీ.మురళి, సీపీఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి

రైతులకు భరోసా ఏదీ?



రైతులకు తూతూమంత్రంగానే కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. కనీసం పెట్టుబడులు, మద్దత్తు ధర్‌పైనా కచ్చితమైన ప్రకటన లేదు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయరంగానికి ప్రాముఖ్యత అంటూ అంకెల గారడీని తలపించేలా బడ్జెట్ ఉంది. గత బడ్జెట్‌లోనూ ఇలాంటి మాయమాటలే చెప్పారు. ఈ ఏడాది రైతులకు ఒరిగిందేమీ లేదు. – కే.రమణమ్మ, వ్యవసాయశాఖ విశ్రాంత ఉద్యోగి, తిరుపతి

జీడీపీ 6 శాతం మేరకు పెంచాలి



గత ఏడాది పాడిన పాటే ఈ ఏడాది నిర్మలమ్మ పాడింది. గత ఏడాది బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఇంతవరకు 30 శాతం కూడా ఖర్చుచేయలేదు. ఈ ఏడాది విద్యారంగానికి బడ్జెట్‌లో 6 శాతం పెంచాల్సిన అవసరం ఉంది. కానీ ఆ ప్రయత్నం చేయలేదు. జిల్లాలోని ఐఐటీ, ఐజర్, హోటల్ మేనేజ్‌మెంట్ విద్యాసంస్థలకు నిధుల కేటాయింపులో సీతకన్ను పడింది. ఎన్‌ఈపీ విధానం అమలుకు ఎటువంటి కేటాయింపులు లేవు.
–ఆర్.రామకృష్ణ, కేంద్ర విద్యాసంస్థ రిటైర్డ్ ఎకనామిక్స్ అధ్యాపకులు, తిరుపతి

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టే బడ్జెట్



రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టే ప్రయత్నమే కేంద్ర బడ్జెట్ సారాంశం. ఇందులో సాగు, తాగు నీటి ప్రాజెక్టులకు ఆశించిన రీతిలో కేటాయింపులు లేవు. జిల్లాలోని ప్రాజెక్టుల పరిస్థితి అంతే. పోలవరానికి పూర్తి ఖర్చు భరిసామన్న ప్రస్తావన లేదు. నిర్వాసితుల పరిస్థితి పట్టించుకోలేదు. కేవలం మరో రూ.5వేల కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించడం దారుణం. రాయలసీమ జిల్లాల అభివృద్ధిపై స్పష్టమైన ప్రకటన, నిధుల కేటాయింపు జరగలేదు.
– పురుషోత్తంరెడ్డి, రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయ కర్త, తిరుపతి